ఆర్ఎస్ఎస్, మోడీ – షా ద్వయానికి కాశ్మీర్ కావాలి గానీ కాశ్మీర్ ప్రజలు వద్దు; వారి జాతీయవాదం నేల మాత్రమే, ప్రజలు కాదు. వారి దృష్టిలో జాతి అంటే ప్రజలు కాదు, కేవలం సరిహద్దులు, దాని లోపలి నేల మాత్రమే.


ప్రచురణ సంఖ్య : 1505 ప్రచురణ కాలం : సెప్టెంబర్, 2019

వెల : ₹10/-

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు), తెలంగాణ కమిటీ

హౌస్ నం. 1-1-60/2, ఎంబి భవన్, ఆర్‌టిసి క్రాస్ రోడ్స్, ముషీరాబాద్, హైదరాబాదు- 20.

ప్రతులకు

నవతెలంగాణ పబ్లిషింగ్ హౌస్

ఎమ్. హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, అజామాబాద్, ఆర్‌టిసి కళ్యాణమండపం దగ్గం, హైదరాబాద్-20. ఫోన్:040-27665420.

నవతెలంగాణ బుక్‌హౌస్ బ్రాంచీలు

హైదరాబాద్ – చిక్కడపల్లి, బాగ్‌లింగంపల్లి, (ఎస్.వి.కె.), ఇ.సి.ఐ.ఎల్., నల్గొండ, హన్మకొండ, కరీంనగర్, ఖమ్మం, నిజామాబాద్, మహబూబ్‌నగర్

ముద్రణ : నవతెలంగాణ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్, హైదరాబాద్




# రాజ్యాంగంపై వేటు
# కాశ్మీరుకు వెన్నుపోటు

ప్రచురణ

భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు)

తెలంగాణ కమిటీ

# రాజ్యాంగంపై వేటు
# కాశ్మీరుకు వెన్నుపోటు

## ప్రారంభం

**2**019 ఆగస్టు 5న మోడీ ప్రభుత్వం మన దేశ రాజ్యాంగంపైనా, ప్రజాస్వామ్యం, ఫెడరిలిజం, లౌకిక సూత్రాలపైనా మెరుపుదాడి చేసింది. ఒక రాష్ట్రపతి ఆదేశం, కొన్ని తీర్మానాలు, జమ్మూ-కాశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం.. వీటి ద్వారా అది రాజ్యాంగం లోని 370వ అధికరణం, దానికి అనుబంధమైన 35 ఎ అధికరణం కింద జమ్మూ-కాశ్మీర్‌కు ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని వమ్ము చేసింది.

జమ్మూ-కాశ్మీర్ ఒక రాష్ట్రంగా మనుగడ సాగించే హక్కును కాలరాశారు. దాన్ని రెండు కేంద్ర పాలిత ప్రాంతాలుగా విడగొట్టారు. మొదటిది జమ్మూ-కాశ్మీర్. దీనికి శాసనసభ ఉంటుంది. రెండోది లడక్. దీన్ని ప్రత్యేక కేంద్రపాలిత ప్రాంతంగా మార్చారు. కార్గిల్‌ను కూడా దీన్లోనే ఉంచారు. లడక్‌కు శాసన సభ ఉండదు. రెండు కేంద్రపాలిత ప్రాంతాలూ కేంద్ర ప్రభుత్వ అధికారం కింద పనిచేయాల్సిందే. మోడీ ప్రభుత్వ చలువ వల్ల మన దేశంలో 29 రాష్ట్రాలు కాస్తా 28కి కుదించబడ్డాయి.

ఈ అసాధారణ చట్టాలనూ, చర్యలనూ సిపిఐ(ఎం) తీవ్రంగా వ్యతిరేకించింది. ఇవి రాజ్యంగ విరుద్ధమైన, చట్ట విరుద్ధమైన నిరంకుశ చర్యలు. మన దేశంలో ఉన్న భిన్నత్వంలో ఏకత్వం సూత్రంపై ఇది ఒక

పెద్ద దాడి. ఇది 370వ అధికరణం కింద ప్రత్యేక హోదాను వమ్ము చేయడమే కాదు మన ప్రజాస్వామ్యాన్నే వమ్ము చేయడం.

ఇప్పటివరకు ఏదైనా రాష్ట్రం హక్కులనుగానీ సరిహద్దులనుగానీ మార్చాలంటే సుదీర్ఘ చర్చల ద్వారా జరిగేది. ఉదాహరణకు, ఆంధ్ర ప్రదేశ్, బీహార్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్ రాష్ట్రాల విభజన విషయం చూద్దాం. వీటిపై ఏళ్ల తరబడి చర్చలు సాగాయి. ఆ రాష్ట్రాల శాసన సభల అభిప్రాయాలు తీసుకున్న తరువాతే అప్పటిపాలకులు రాష్ట్రాలను విభజించారు. భారత రాజ్యాంగంలోని 3వ అధికరణం ప్రకారం రాష్ట్రాల శాసన సభల అభిప్రాయాలు తీసుకోవడం తప్పనిసరి. కానీ బిజెపి ప్రభుత్వం జమ్మూ–కాశ్మీర్‌లో ఈ నిబంధనను కర్కశంగా ఉల్లంఘించింది.

ఆ విధంగా స్వతంత్ర భారత చరిత్రలో తొలిసారిగా ఒక రాష్ట్ర ప్రజల భవిష్యత్తును ఆ ప్రజల అభిప్రాయాలతో పని లేకుండా, కనీసం వారు తమ భవిష్యత్తును గురించి చర్చించుకునే అవకాశం ఇవ్వకుండా నిర్ణయించడం జరిగింది. ఆ విధంగా ఇది ఒక ప్రమాదకరమైన పద్ధతిని సృష్టించింది. మోడీ–షా ద్వయం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం, పార్లమెంటులోని తన మందబలాన్ని ఉపయోగించుకుని రాష్ట్రాల హక్కులపై పాశవిక దాడి చేస్తుందన్న మాట. ఆ విధంగా ఇది రాజ్యాంగంలోని ఫెడరల్ నిర్మాణంపై కూడా పెద్ద దాడిగా పరిగణించాలి.

ఈ చర్యతోపాటుగానే నియోజకవర్గాల పునర్విభజనకు చేస్తున్న ప్రయత్నాలు కూడా మోడీ ప్రభుత్వ అసలైన ఎత్తుగడ ఏమిటో చెబుతోంది. అది రాష్ట్రంలో జనాభా పరిస్థితిని మార్చడానికి పూనుకుంది. ముస్లిమేతర ప్రాంతాలకు అధిక ప్రాధాన్యతనిస్తూ నియోజకవర్గాల పునర్విభజన చేస్తోంది. 35 ఎ సెక్షన్ కింద శాశ్వత నివాస ప్రతిపత్తిని తొలగించడంతో ఈ పనిచేయడం సులువైపోతుంది.

కేంద్ర ప్రభుత్వ చర్యను కాశ్మీర్ లోయలోని ప్రజానీకంతోపాటు జమ్ములో ఉన్న ముస్లింలు (33.45 శాతం), లడక్‌లోని ముస్లింలు (46.4 శాతం) కూడా తీవ్రంగా వ్యతిరేకిస్తున్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. పాకిస్తాన్ సరిహద్దులో ఉన్న కార్గిల్ ప్రజలు కూడా 370వ అధికరణం కింద ఉన్న ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ కార్గిల్ ప్రజలే పాకిస్తాన్‌కు వ్యతిరేకంగా ధైర్యంగా పోరాడిన విషయం మనకు తెలుసు. అందువల్ల బిజెపి ప్రభుత్వ చర్య చాలా ప్రమాదకరమైంది. దీని విపరిణామాలు చాలా ఉంటాయి.

ఈ సందర్భంగా ఉపయోగించిన పద్ధతి కూడా రాజ్యాంగంపై ఒక దాడి. రద్దు చేయబడిన 370వ అధికరణం కింద రాష్ట్రపతి జారీచేసిన ఒక ఆదేశాన్ని ఉపయోగించుకుని మరో అధికరణం 367 లో మార్పులు చేశారు. ఈ మార్పు చేసిన అధికరణాన్ని ఉపయోగించుకుని 370 అధికరణం సారాన్ని రద్దు చేశారు. కుట్రపూరితమైన ఈ పద్ధతి ద్వారా రాష్ట్ర శాసన సభ ఆమోదం పొందకుండానే గవర్నరు పని కానిచ్చేశారు. ఎందుకంటే రాష్ట్రం రాష్ట్రపతి పాలన కింద ఉంది గనుక. అందువల్ల ఇది రాజ్యాంగ ద్రోహమేగాక, ప్రజాస్వామ్యాన్ని హత్య చేయడం అనేదాంట్లో సందేహం లేదు.

మొత్తం జమ్మూ–కాశ్మీర్ రాష్ట్రాన్ని దిగ్బంధం చేశారు. కోటికి పైగా ఫోన్ లైన్లను కట్ చేసేశారు. ప్రజారవాణాను నిలిపేశారు. ఇంటర్ నెట్‌ను రద్దు చేశారు. ఆఫీసులు, షాపులు మూసేశారు. తీవ్రమైన అవసరాలు ఉంటేనే ప్రజలు బయటకు వెళ్లగలిగేది, అది కూడా సాయుధ బలగాలు నెలకొల్పిన ముళ్ల కంచెలు, బారికేడ్లు దాటుకుని మాత్రమే. వార్తా పత్రికలు, టివి ఛానళ్లను దాదాపు నిలిపేశారు. జమ్మూ–కాశ్మీర్‌ను ఇప్పుడు ఒక ఆక్రమిత ప్రాంతంలా చూస్తున్నారు.

జమ్మూ–కాశ్మీర్‌లోని అన్ని రాజకీయ పార్టీల నాయకులందరినీ అరెస్టు చేశారు, లేక గృహ నిర్బంధంలో

ఉంచారు. ఇద్దరు మాజీ ముఖ్యమంత్రులు, సిపిఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు, నాలుగుసార్లు శాసనసభ్యునిగా గెలిచిన యూసఫ్ తరిగామి ఇంకా అనేక వందల మంది నాయకులు ఇందులో ఉన్నారు. మోడీ ప్రభుత్వం చెబుతున్నట్లు ఇదంతా జమ్మూ-కాశ్మీర్ మంచి కోసమే చేస్తున్నట్లయితే వారు ప్రజలను చూసి ఎందుకు భయపడుతున్నట్లు? తుపాకీ గొట్టాన్ని నుదుట పెట్టి, లేక అణచివేతలతో జాతీయ సమగ్రతను సాధించలేరు. జమ్మూ-కాశ్మీర్ ప్రజలకు ద్రోహం చేయడమే కాకుండా దేశ లౌకిక, ప్రజాస్వామిక విలువలపై దాడి చేసే ఈ చర్యలకు దేశం చాలా పెద్ద మూల్యం చెల్లించాల్సి వస్తుంది.

ఈ సందర్భంగా బిజెపి దాని "మిత్రులు" - ఇందులో కొన్ని టెలివిజన్ ఛానెళ్లు కూడా ఉన్నాయి- కాశ్మీర్ చరిత్రపైనా, జాతీయోద్యమ నాయకులపైనా, కాశ్మీర్ ప్రజలపైనా తప్పుడు ప్రచారం ప్రారంభించారు. చరిత్రను వక్రీకరిస్తున్నారు. ఈ నిరంకుశ చర్యలను వ్యతిరేకించేవారిపై విషం కక్కుతూ వాట్సాప్‌లు, ఇతర సోషల్ మీడియా వేదికల్లో విషప్రచారకులు (ట్రోల్స్) పెద్ద ఎత్తున తెగబడి ప్రచారం చేస్తున్నారు.

జమ్మూ-కాశ్మీర్ భారత దేశంలో కలయిక సందర్భంగా దానికి లభించిన ప్రత్యేక ప్రతిపత్తి గురించీ, 370వ అధికరణానికి దారితీసిన రాజకీయ పరిస్థితుల గురించీ చారిత్రక వాస్తవాలను దిగువ నిస్తున్నాం.

**ప్రశ్న : కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి ఎందుకిచ్చారు?**

స్వాతంత్ర్య సమయంలో భారతదేశం రెండుగా విభజించబడినప్పుడు జమ్మూ-కాశ్మీర్ రాచరిక సంస్థానంగా ఉండేది. డోగ్రా మహారాజా హరిసింగ్ దాన్ని పాలించేవారు. దీని కింద మూడు నిర్ధిష్టమైన ప్రాంతాలు ఉన్నాయి. 1. జమ్ము 2. కాశ్మీర్ లోయ 3. లడక్. మత నమ్మకాలకు సంబంధించి చూస్తే మెజారిటీ ప్రజలు ముస్లింలు. ఆ సమయంలో అత్యధిక సంస్థానాలు విలీన

ఒప్పందాలపై సంతకాలు చేసి భారత దేశంలో విలీనమై భారత యూనియన్‌లో చేరాయి.

**కాశ్మీర్‌లో పరిస్థితి వేరుగా ఉండేది.**

ఇక్కడ కాశ్మీర్ మహారాజు హరిసింగ్ భారత్‌లో విలీనానికి ఒప్పుకోలేదు. 1947 అక్టోబర్ ప్రారంభంలో అంటే భారతదేశం స్వాతంత్ర్యం పొందిన రెండు మాసాల తరువాత ఆయన బ్రిటిష్ గవర్నర్ జనరల్ మౌంట్ బాటన్‌కు ఒక లేఖ రాశారు. అందులో ఆయన ఇలా పేర్కొన్నారు: "జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రం భారత్ లేక పాకిస్తాన్‌లలో దేనిలోనూ విలీనంకాని సంగతి దొరవారి దివ్య సముఖమునకు తెలుసు. భౌగోళికంగా మా రాష్ట్రం రెండు దేశాలకూ ఆనుకుని ఉంది. ఈ రెండు దేశాలతోనూ దీనికి ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలున్నాయి. అంతేకాకుండా మా రాష్ట్రానికి సోవియట్ రిపబ్లిక్‌తోనూ, చైనాతోనూ ఉమ్మడి సరిహద్దు ఉంది. భారత్, పాకిస్తాన్‌లు తమ విదేశీ సంబంధాల్లో ఈ విషయాన్ని విస్మరించలేవు.

"ఏ దేశంలో విలీనం చేయాలి, లేక రెంటిలో దేనితో కలిసినా ప్రయోజనం లేకపోతే రెండు దేశాలతో స్నేహ సంబంధాలు కొనసాగిస్తూ రాష్ట్రం స్వతంత్రంగానే ఉండిపోవాలా అన్న విషయాలను ఆలోచించుకోడానికి నేను మరికొంత సమయం తీసుకోదలుచుకున్నాను."

కాశ్మీర్‌లో రాచరిక పాలన కొనసాగిస్తూ దాన్ని స్వతంత్రంగా ఉంచాలని బ్రిటీష్ వాళ్లు తమ వ్యూహాత్మక కారణాల రీత్యా కోరుకున్నారు. అయితే కాశ్మీర్ ప్రజలు అప్పటికే మహారాజా పాలనలో ఫ్యూడల్ క్రూరత్వాన్ని అనుభవించి ఉన్నారు. దేశంలోని ఇతర అన్ని సంస్థానాల మాదిరిగానే కాశ్మీర్‌లో కూడా స్వాతంత్ర్యో ద్యమం బ్రిటీష్ వారికి వ్యతిరేకంగానే కాకుండా రాచరిక పాలనకు కూడా వ్యతిరేకంగా సాగింది. రాచరిక పాలనలో భూమి కొద్ది మంది వద్ద కేంద్రీకృతమైంది. రైతులపై విపరీతమైన దోపిడీ పీడన సాగేది.

మహారాజా హరిసింగ్ రాష్ట్ర ఆదాయంలో పూర్తిగా మూడో వంతు తన ''సొంత'' ఖర్చులకు కేటాయించుకునేవారు. అదే విధంగా బడా భూస్వాములు అధిక భాగం భూములను తమ చేతుల్లో పెట్టుకున్నారు. దాంతో రైతాంగం పేదరికంలో మునిగిపోయారు. షేక్ అబ్దుల్లా నేతృత్వంలోని నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వంలో కాశ్మీర్‌లో పెద్ద ఎత్తున ప్రజా విముక్తి పోరాటం సాగింది. ఈ పోరాటం చివరికి 'రాజు కాశ్మీర్ విడిచి పోవాలి' అన్న నినాదంగా పరిణమించింది. ఉద్యమం పూర్తిగా లౌకిక, కాశ్మీరీయత్ సంస్కృతి ప్రాతిపదికపై సాగింది. స్థానిక సంప్రదాయాలు, క్రతువులతో సూఫీ సంప్రదాయం కలయిక వల్ల ఏర్పడిందే 'కాశ్మీరీయత్' సంస్కృతి.

ఆ విధంగా బ్రిటీష్ ప్రోద్బలంతో స్వతంత్రంగా ఉండాలనుకున్న హరి సింగ్ ప్రణాళికను కాశ్మీర్ ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఇస్లామ్ పేరుతో పాకిస్తాన్‌లో కలవాలన్న మహమ్మద్ ఆలీ జిన్నా పిలుపును కూడా వారు వ్యతిరేకించారు. కాశ్మీర్‌లో జమ్మూ-కాశ్మీర్ ముస్లిం లీగ్ నాయకత్వంలో కొద్దిమంది ప్రజలే రాష్ట్రాన్ని పాకిస్తాన్‌లో కలపడానికి ఇష్టపడ్డారు. వాస్తవానికి కాశ్మీర్‌లోని ఫ్యూడల్ వ్యతిరేక పోరాట నాయకులు పాకిస్తాన్‌ను ఇస్లామిక్ మెజారిటీ మత రాజ్యంగానే కాకుండా దాన్ని ఫ్యూడల్ ప్రయోజనాలకోసం నిలిచే రాజ్యంగానూ చూశారు. రాష్ట్రంలో ఫ్యూడల్ భూ సంబంధాలను నాశనం చేయాలన్నది నేషనల్ కాన్ఫరెన్స్ ముఖ్య డిమాండు. పాకిస్తాన్ రాజ్యం ఈ డిమాండ్‌కు మద్దతివ్వదని వారికి తెలుసు.

ఇంకోవైపు పాకిస్తాన్ బ్రిటీష్ వారి సహకారంతో వాయవ్య సరిహద్దు రాష్ట్రం నుండి సాయుధ బలగాలను కాశ్మీర్ దురాక్రమణకోసం పంపించింది. ఈ గ్రూపులు యుద్ధ చేస్తూ ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి వెళ్లాయి. ప్రజలపై అనేక చిత్రహింసలు జరిపారు. స్థానికంగా నివసించే హిందూ, ముస్లిం ప్రజానీకాన్ని

దోచుకున్నారు. చివరికి శ్రీనగర్ నగర సరిహద్దులకు చేరుకున్నారు. అలాంటి సమయంలో నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెంది వీరోచిత నాయకుల నేతృత్వంలో ప్రజా సైన్యం కూడదీసుకుని దురాక్రమణదారులను వెనక్కు తిప్పి కొట్టింది. అనేక త్యాగాలతో వారు శ్రీనగర్‌ను రక్షించుకున్నారు. ఈ పోరాటంలో వందలాది మంది కాశ్మీరీలు మరణించారు.

హరిసింగ్ ఆయన బంధుగణం, ప్రభు వర్గానికి చెందిన వారంతా జమ్మూకు పారిపోయారు. అప్పుడు గానీ ఆయన భారత సైన్యం సహాయం కోరుతూ మౌంట్ బాటన్‌కు లేఖ రాయలేదు. భారత్‌తో విలీనమైనతేనే ఆయనకు సైన్యం మద్దతు లభిస్తుంది. అందువల్ల ఇటువంటి పరిస్థితుల్లో, ప్రజా ప్రతిఘటన నుండి పెద్ద ఎత్తున ఒత్తిడి వచ్చిన పరిస్థితుల్లో ఆయన 1947 అక్టోబర్ 26న భారత్‌తో విలీన ఒప్పందంపై సంతకాలు చేశారు. దాంతో భారత సైన్యం శ్రీనగర్‌లో దిగింది. కాశ్మీర్ లోయలోని ప్రజల సహకారం, మద్దతుతో అది దురాక్రమణదారులను తరిమి కొట్టింది. బ్రిటీష్ ఒత్తిడితో మన సైన్యం ఉరి సరిహద్దు వద్ద ఆగిపోయింది. ఎందుకంటే అప్పటికింకా భారత సైన్యంలో బ్రిటీష్ వారి పాత్ర ఉండేది.

తదుపరి ఐక్యరాజ్య సమితి జోక్యం చేసుకుంది. పాకిస్తాన్ సైన్యం రాష్ట్రంలోని మూడోవంతు భూ భాగాన్ని ఆక్రమించుకుంది. ప్రజాభిప్రాయ సేకరణ (ప్లెబిసైట్)కు అంగీకరించారు. దాంతో కాశ్మీర్ ''వివాదం'' ఆవిర్భవించింది.

ఆక్రమిత ప్రాంతం నుండి తన సైన్యాన్ని ఉపసంహరించుకోడానికి పాకిస్తాన్ నిరాకరించడంతో ప్రజాభిప్రాయ సేకరణ జరగలేదు. అయితే కాశ్మీర్ లోయ ప్రజలు మాత్రం భారతదేశం తమ సంస్కృతినీ, తమ జీవన విధానాన్నీ, తమ స్వయం ప్రతిపత్తినీ..వీటన్నిటినీ

కలిపి చెప్పే 'కాశ్మీరీయత్'నూ రక్షిస్తుందని గట్టిగా విశ్వసించారు.

కాశ్మీరుకు ప్రత్యేకమైన ఈ పరిస్థితుల్లో కాశ్మీర్ రాష్ట్రానికి ప్రత్యేక ప్రతిపత్తి ఇచ్చారు. ఈ అమరిక ఐక్యరాజ్య సమితి ద్వారా అంతర్జాతీయ జోక్యాన్ని నివారించింది. ఇది కాశ్మీర్ ఒక వైపు భారత్‌లో భాగాంగా ఉండేట్లు చేసింది, అదే సమయంలో భారత యూనియన్‌లో భాగంగా కాశ్మీరీలు తమ స్వయంప్రతిపత్తిని నిలుపుకోవచ్చున్న భరోసాను ఆ ప్రజలకు కల్పించింది.

**ప్రశ్న : మహారాజాకు మద్దతిచ్చిన శక్తులెవరు?**

ఒకవైపు మతాలకు అతీతంగా కాశ్మీరీ ప్రజలు న్యాయం, ప్రజాస్వామ్యం, స్వాతంత్ర్యం అనే ఫ్యూడల్ వ్యతిరేక ప్రజాతంత్ర డిమాండ్లకోసం, మహారాజా నిరంకుశ పాలనకూ, బ్రిటీష్ వారికీ వ్యతిరేకంగా పోరాడుతుంటే మరోవైపు బిజెపి మాతృసంస్థ ఆర్ఎస్ఎస్. రాచరిక పాలనకు మద్దతుగా అన్ని రకాల అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ శక్తులను కూడగడుతోంది. హిందూ రాష్ట్ర ఏర్పాటు చేయాలన్న తన లక్ష్యానికి అనుగుణంగా అది కాశ్మీర్ ప్రజల పోరాటాన్ని మతాల ప్రాతిపదికగా చీల్చడానికి ప్రయత్నించింది. హిందువుల రక్షణ పేరుతో అది బహిరంగంగా మహారాజా కుట్రలకు మద్దతు తెలిపింది, ఫ్యూడల్ వ్యవస్థను రక్షించడానికి పూనుకుంది. జమ్మూలో అది ప్రజా పరిషత్ పేరుతో పనిచేస్తూ నేషనల్ కాన్ఫరెన్స్ ప్రభావాన్ని తగ్గించేందుకు ప్రయత్నించింది.

1947 జూన్-జులైల్లో, దేశానికి స్వాతంత్ర్యం వచ్చే సమయంలో ఆర్ఎస్ఎస్ స్వతంత్ర రాజ్యం కావాలన్న మహారాజా డిమాండుకు మద్దతిచ్చింది. కాశ్మీర్ భారత్‌లో విలీనం కావడాన్ని వ్యతిరేకించింది. పాకిస్తాన్ మద్దతుగల దురాక్రమణదారులను వెనక్కు కొట్టేందుకు కాశ్మీర్ ప్రజలు పోరాడుతున్నప్పుడు అది ఎక్కడా రంగంలో లేదు. ఇంకా దుర్మార్గం ఏమంటే ఆ సమయంలో అది

మతపరమైన లక్ష్యాలతో యువకులకు సాయుధ శిక్షణ ఇస్తోంది. ఆ విధంగా దేశ విభజన సమయంలో భారత దేశం అగ్నికి ఆహుతవుతుంటే కాశ్మీర్ లోయ మాత్రం ఎటువంటి మత ఘర్షణలు లేకుండా ప్రశాంతంగా ఉంది. కానీ దానికి పొరుగునే ఉన్న జమ్మూలో మాత్రం మహారాజా మద్దతుతో ప్రజా పరిషత్ నాయకత్వంలో భయంకరమైన మత విధ్వంసకాండ చెలరేగింది. అందులో జమ్మూకు చెందిన అనేక మంది ముస్లింలను ఊచకోత కోసి చంపారు.

విలీన ఒప్పందంపై సంతకాలు జరిగిన తరువాత జమ్మూ రాష్ట్రాన్ని విడదీయడం కోసం ప్రజా పరిషత్ తన మతపరమైన ద్విజాతి సిద్ధాంతం ఆధారంగా పెద్ద ఎత్తున ఆందోళన లేవనెత్తింది. స్వాతంత్ర్యం తరువాత భారత జాతీయ పతాకం పక్కనే మహారాజా పతాకం ఎగురుతున్నా ఆర్ఎస్ఎస్‌కు పట్టలేదు. రెండు పతాకాలు ఎగరడం దానికి ఒక సమస్య కాలేదు. కొత్తగా ఏర్పడిన జమ్మూ-కాశ్మీర్ రాజ్యాంగ సభ రాచరికాన్ని రద్దు చేసి, రాష్ట్ర ప్రజలందరి కోరికను అనుసరించి మహారాజా పతాకం స్థానంలో రాష్ట్ర పతాకాన్ని ఎగుర వేసిన తరువాత మాత్రమే ఆర్ఎస్ఎస్ 'ఒక పతాకం, ఒక దేశం' నినాదాన్ని ఎత్తుకుంది. నేపాల్‌లో ఎలాగైతే రాచరిక శక్తులతో ఆర్ఎస్ఎస్ మిలాఖత్ అయి, రాచరికానికి నిరంతరం మద్దతుగా నిలబడిందో అలాగే కాశ్మీర్‌లో ఫ్యూడల్ రాజరిక దుర్మార్గాలకూ, దోపిడీకి వ్యతిరేకంగా పోరాటం జరుగుతున్న ఆ రోజుల్లో ఆర్ఎస్ఎస్ మతం పేరుతో మహారాజాకు మద్దతుగా నిలబడింది.

అది ఐక్యతకోసం జమ్మూ-కాశ్మీర్ ప్రజలు జరుపుతున్న పోరాటాన్ని బలహీనపరిచింది.

**ప్రశ్న : 370, 35ఎ అధికరణలు అంటే ఏమిటి, అది ఎప్పుడు చట్టం చేయబడింది?**

షేక్ అబ్దుల్లాను అత్యవసర ప్రభుత్వాధిపతిగా నియమిస్తూ 1947 అక్టోబర్ 30న మహారాజా ఒక

ఆదేశం జారీ చేశారు. తరువాత 1948 మార్చి 5న ఈ ప్రభుత్వం స్థానంలో ఒక మధ్యంతర ప్రభుత్వం ఏర్పడింది. దానికి ప్రధాన మంత్రిగా షేక్ అబ్దుల్లాను నియమించారు. ఇది రాష్ట్ర రాజ్యాంగాన్ని రచించడానికి ఒక జాతీయ అసెంబ్లీగా పనిచేసింది. అయితే మహారాజా నామకః ప్రభుత్వాధినేతగా ఉన్నారు.

ఈ లోగా భారత ప్రభుత్వం తాను ఇచ్చిన హామీ మేరకు కాశ్మీర్ నాయకులతో ప్రత్యేక ప్రతిపత్తిపై చర్చలు ప్రారంభించింది.

కాశ్మీర్‌ను ప్రత్యేకంగా చూడ్డాన్ని వల్లభాయ్ పటేల్ వ్యతిరేకించారని ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రచారం చేస్తోంది. కానీ వాస్తవం దానికి భిన్నంగా ఉంది. 1949 మే 15,16 తేదీల్లో పటేల్ ఇంట్లో ఒక సమావేశం ఏర్పాటు చేశారు. అందులో ఆయనతోపాటు జవహర్‌లాల్ నెహ్రూ, షేక్ అబ్దుల్లా పాల్గొన్నారు. “రాష్ట్రం ఏయే అంశాలను కేంద్రానికి అప్పగిస్తుందో నిర్ణయించాల్సింది తదుపరి సమావేశమయ్యే రాజ్యాంగ శాసనసభే” అని వారంతా అంగీకరించారు. ఈ విషయం షేక్ అబ్దుల్లాకు నెహ్రూ రాసిన లేఖలో రికార్డు చేసిఉంది. ఆనాడు నెహ్రూ మంత్రివర్గంలో శ్యాం ప్రసాద్ ముఖర్జీ కూడా ఉన్నారు. కనుక కాశ్మీర్ విషయంలో తీసుకున్న నిర్ణయాల్లో ఆయన కూడా భాగస్వామే. 370వ అధికరణం (ముసాయిదా రాజ్యాంగంలో 306ఎ అధికరణం) అమోదించినప్పుడు జరిగిన సభకు డా॥ రాజేంద్ర ప్రసాద్ అధ్యక్షత వహించారు. అందువల్ల ఆనాడు నాయకత్వమంతా కాశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి ఇవ్వడాన్ని అంగీకరించింది.

ఈ చర్చల సారాంశంగా 370 అధికరణం రూపొందింది. దాన్ని 1949 అక్టోబర్‌లో రాజ్యాంగ శాసనసభ ఆమోదించింది. ఇది జమ్మూ–కాశ్మీర్ రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి కల్పించే ఒక చట్టాన్ని రూపొదించింది. దీన్నిబట్టి రాష్ట్రానికి సొంత రాజ్యాంగం ఉంటుంది. పతాకం ఉంటుంది. విలీనం ఒప్పందంలో పేర్కొన్న

మూడు అంశాలు (విదేశీ వ్యవహారాలు, రక్షణ, కమ్యూనికేషన్లు) మినహా మిగిలిన అన్ని అంశాల్లో దానికి పూర్తి అధికారాలుంటాయి. విలీన ఒప్పందంలోని అంశాలపై కేంద్ర చట్టాలకు సంబంధించి అది రాష్ట్ర ప్రభుత్వంతో “సంప్రదింపులు” మాత్రమే జరుపుతుంది. కానీ ఇవి కాకుండా కాశ్మీరుకు సంబంధించిన ఇతర అన్ని అంశాలపైనా రాష్ట్ర ప్రభుత్వ సమ్మతి, ఆమోదం తీసుకోవాల్సి ఉంటుంది. ఈ అధికరణం ఆమోదించినప్పుడు 1949 అక్టోబర్ 17న రాజ్యాంగ శాసనసభలో ఎన్. గోపాలస్వామి అయ్యంగార్ తన ప్రసంగంలో ఇలా చెప్పారు: “ఇది (ప్రత్యేక ప్రతిపత్తి) కాశ్మీర్ ప్రజలకూ, ప్రభుత్వానికీ మనం ఇచ్చే కట్టుబాటు.” నేడు బిజెపి హయాంలో ఆ కట్టుబాటు తునాతునకలైంది.

భారత యూనియన్ కింద ‘కాశ్మీరియత్’గా పిలిచే తమ సొంత గుర్తింపునూ, జీవన విధానాన్నీ రక్షించుకోవాలన్న కాశ్మీరీ ప్రజల ఆకాంక్షలకు ప్రతిరూపం 370వ అధికరణం. రాజ్యాంగ శాసనసభ 370వ అధికరణాన్ని రాజ్యాంగంలో చేర్చడానికి మాతృక ఇది. దీని తరువాత 1952లో కేంద్ర ప్రభుత్వ ప్రతినిధులకూ, కశ్మీర్ ప్రభుత్వ ప్రతినిధులకూ మధ్య ఢిల్లీ ఒప్పందం కుదిరింది.

35ఎ అధికరణం, 370వ అధికణం నుండి తన అధికారాలు పొందింది. 1954లో రాష్ట్రపతి ఆదేశం ద్వారా ఆమోదం పొందింది. రాష్ట్రంలో శాశ్వత నివాసులు ఎవరు, వారి హక్కులు, అధికారాలు ఏమిటి అని నిర్వచించే అధికారాన్ని ఇది జమ్మూ- కాశ్మీర్ శాసన సభకు దఖలు పరుస్తోంది.

అంతకు ముందు మహారాజా పాలనా కాలంలో కాశ్మీరీ పండితుల నాయకత్వంలో స్థానిక ప్రజలు బయటివారి నుండి అంటే ప్రధానంగా బ్రిటీష్ వారి నుండీ, భారతీయ ధనిక పెట్టుబడిదారులనుండీ రక్షణ కోరేవారు. ఈ ధనికులంతా అందమైన కాశ్మీరంలో భూములు

కొనేయాలనుకునేవారు. 1927లో వారసత్వ రాష్ట్ర వాసుల ఆదేశం (హెరిడిటరీ స్టేట్ సబ్జెక్ట్ ఆర్డర్)ను ఆమోదించారు. దీని ప్రకారం రాష్ట్ర వాసులు మాత్రమే ప్రభుత్వ ఉద్యోగాల్లో నియమితులయ్యే హక్కు కలిగి ఉంటారు. భూమి వినియోగం, యాజమాన్య హక్కులు కూడా వారికే ఉంటాయి. రాష్ట్రేతరులకు ఇటువంటి హక్కులు ఉండవు. ఈ చట్టాన్ని రద్దు చేసి 1954లో 35ఎ అధికరణాన్ని ప్రవేశపెట్టారు. దీని ప్రకారం శాశ్వత నివాసులుగా గుర్తించడానికి పారామీటర్లు నిర్ణయించే అధికారం శాసన సభకు దక్కుతుంది.

సుప్రీం కోర్టులో కేసు పెండింగులో ఉండగానే ఈ అధికరణాన్ని రద్దు చేయడాన్ని బట్టి చూస్తే బిజెపి ముస్లిం ఆధిపత్య రాష్ట్రంలో జనాభా నిష్పత్తులను మార్చివేయడానికి ఎంతగా తొందరపడుతోందో అర్థమవుతుంది. ఇప్పుడు ప్రతి ఒక్కరూ కాశ్మీర్‌లో భూములు కొనుక్కోవచ్చు అని బిజెపి చేస్తున్న ప్రచారం సరిగ్గా ఈ లక్ష్యాన్ని సాధించడం కోసమే. ఇది ఇజ్రాయిల్‌లో యూదు దురహంకార ప్రభుత్వం చేస్తున్నట్లే ఉంది. అక్కడ పశ్చిమ తీరంలో జనాభా నిష్పత్తిని మార్చేయడం కోసం ఆ ప్రభుత్వం యూదు ఆవాసాలను ప్రోత్సహిస్తోంది.

370వ అధికరణంలోని అనేక నిబంధనలను కేంద్ర ప్రభుత్వాలు కాల క్రమంలో అనేక సంవత్సరాలుగా పలుచబారుస్తూ వచ్చాయి. కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వాలు కూడా ఈ పనిచేస్తూ వచ్చాయి. దీనివల్ల జమ్మూ-కాశ్మీర్ స్వయం ప్రతిపత్తి గణనీయంగా తరిగిపోతూ వచ్చింది. ఈ విషయాలను తరువాత మనం తెలుసుకుందాం.

**ప్రశ్న : జమ్మూ-కాశ్మీర్‌కు మాత్రమే ప్రత్యేక నిబంధనలున్నాయా?**

బిజెపి ప్రచారం చేస్తున్నట్లు జమ్మూ-కాశ్మీర్‌కు మాత్రమే ప్రత్యేక నిబంధనలు లేవు. 371వ అధికరణంలో

ఇతర రాష్ట్రాలకు కూడా ఇటువంటి నిబంధనలున్నాయి. 371వ అధికరణం నుండి 371 (ఎ), 371(I) వరకు పలు నిబంధనలున్నాయి. వీటిలో శాశ్వత నివాసులు మినహా ఇతరులు భూములు కొనకుండా, ఉద్యోగాలు పొందకుండా నిషేధించేవి కూడా ఉన్నాయి. 371వ అధికరణం, దాని ఉపక్లాజుల కిందకు వచ్చే రాష్ట్రాలు : మహారాష్ట్ర, గుజరాత్, అరుణాచల్ ప్రదేశ్, అస్సాం, హిమాచల్ ప్రదేశ్, మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర, ఉత్తరాఖండ్, గోవా, కర్నాటక.

ఇదే కాకుండా రాజ్యాంగంలో ఆదివాసీ/గిరిజన యాజమాన్యంగల/ ఆక్రమించిన భూముల రక్షణ కోసం షెడ్యూల్ 5, 6 ఉన్నాయి. ఏ గిరిజనేతరుడు కూడా ఈ భూములు కొనడానికి అనుమతి లేదు.

35ఎ నిబంధన రద్దు విషయంలో బిజెపి నాయకులు తీసుకున్న ద్వంద్వ వైఖరి చూస్తే బిజెపి మోసకారితనం బయటపడుతుంది. కాశ్మీర్‌లో భూములు కొనుగోలు చేసుకోవచ్చునని మిగిలిన దేశమంతటా విషప్రచారం చేస్తూనే మరోవైపు జమ్ములోని బిజెపి నాయకులు అక్కడ భూములను ఇతరులనుండి రక్షించేందుకు ప్రత్యేక నిబంధనలు చేయాలని కోరుతున్నారు. వాళ్లే 35ఎ నిబంధన రద్దు చేస్తారు, మళ్లీ వాళ్లే ఆ 35ఎ కింద లభించే ప్రత్యేక రక్షణలు కావాలంటారు!

దేశంలోని ఒక ప్రత్యేక ప్రాంతపు, లేక ఒక రాష్ట్రపు ప్రత్యేక అవసరాలు తీర్చడానికి ఈ నిబంధనలు భారత రాజ్యాంగంలో ఉన్నాయి. ఇవి మన ఫెడరల్ నిర్మాణంలో భాగం. భారత దేశం వైవిధ్యపూరితమైన అనేక భాషలు, సంస్కృతులు, కులాలు, మత నమ్మకాలు గల దేశం. అంతేకాదు అభివృద్ధిలో కూడా అసమానతలున్న దేశం. ఈ వైవిధ్యాలను దృష్టిలో పెట్టుకుని ఆయా ప్రాంతాలు,

ప్రజలకు న్యాయం చేసేందుకు భారత రాజ్యాంగంలో ఈ క్లాజులన్నీ చేర్చారు.

1947 కాలంలో భారత దేశంలో విలీనం అయిన సందర్భంలో జమ్మూ-కాశ్మీరుకు పైఅవసరాలు ఏర్పడ్డాయి. అప్పుడు ముస్లింలు మెజారిటీగాగల ఒక రాష్ట్రం, ముస్లిం దేశంగా మారబోతున్న పాకిస్తాన్‌లో కాకుండా లౌకిక భారతదేశంలో విలీనమైంది. 371వ అధికరణం ఆనాడు దేశంలోని అనేక రాష్ట్రాలకూ, ప్రాంతాలకూ ఇస్తున్నట్లే జమ్మూ-కాశ్మీర్ ప్రజల గుర్తింపునకు కూడా గౌరవం ఇస్తామని ప్రతిజ్ఞపూర్వకమైన గ్యారంటీ ఇచ్చిందే 370వ అధికరణం. మోడీ ప్రభుత్వం 370వ అధికరణాన్ని దాదాపు రద్దుచేయడం ద్వారా, దేశంలోని ఫెడరలిజాన్ని పెద్ద దెబ్బ తీయడం ద్వారా కాశ్మీర్ ప్రజలకిచ్చిన ఈ వాగ్దానానికి ద్రోహం చేసింది. రేపు ఏదో ఒక వంకతో ఇతర రాష్ట్రాలకున్న ప్రత్యేక నిబంధనలను కూడా రద్దు చేయవచ్చు.

**ప్రశ్న : జమ్మూ-కాశ్మీర్‌లో "ప్రత్యేక ప్రతిపత్తి" ఎలా అమలు జరిగింది?**

కాశ్మీర్‌కు రాజ్యాంగాన్ని రూపొందించడానికి ఏర్పడిన రాజ్యాంగ శాసనసభ 45 మందితో ఎన్నికైంది. ఇది కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఏర్పడింది. 1951 నవంబర్ 5న సభ తొలిసారి సమావేశమైంది. రాష్ట్రానికి రాజ్యాంగాన్ని తయారు చేయడం అనే తనకు అప్పగించిన పని చేశాక 1956 నవంబర్‌లో అది రద్దు అయింది.

"కాశ్మీర్ భారత దేశంలో భాగంగా ఉంది, ఉంటుంది" అని జమ్మూ-కాశ్మీర్ రాజ్యాంగంలోని 3వ అధికరణం పేర్కొంటోంది. మరి అలాంటప్పుడు ఇది వేర్పాటువాదానికి దారి తీస్తుందని ఎలా చెబుతారు?

మరీ ముఖ్యమైన విషయం ఏమంటే, భారత రాజ్యాంగంలోని స్వేచ్ఛలన్నీ కాశ్మీర్ రాజ్యాంగంలో ఉన్నాయి. ఏ వ్యక్తి అయినా తనకు ఇష్టమైన మతాన్ని ఆచరించవచ్చు అన్న స్వేచ్ఛ కూడా అందులో ఉంది.

ఇంకో మాటలో చెప్పాలంటే ఈ రాజ్యాంగం ఒక లౌకిక రాజ్యాంగ పత్రం. ఇది ముస్లిం మతతత్వాన్ని ప్రోత్సహిస్తోంది, వేర్పాటువాదాన్ని ప్రోత్సహిస్తోంది అని చేస్తున్న ప్రచారమంతా బూటకమే.

అసలు వాస్తవమేమంటే, బిజెపి ప్రచారానికి భిన్నంగా నాటి రాజ్యాంగ శాసనసభ, ప్రత్యేక ప్రతిపత్తిని ఉపయోగించుకుని, ఆనాడు భారతదేశంలోని ఇతర ప్రాంతాలు వేటిలోనూ లేని సమూల చర్యలు తీసుకుంది. మొదటిది. అది రాచరికాన్ని రద్దు చేస్తూ ఒక తీర్మానం ఆమోదించింది. రాజుకు కేటాయించిన ప్రత్యేక అధికారాలను కూడా రద్దు చేసింది. ఆ విధంగా అది కాశ్మీర్ ప్రజలకు ప్రయోజనం కలిగించే ప్రజాతంత్ర విధానాలు చేపట్టింది. ఈ పని భారత దేశంలోని ఇతర ప్రాంతాల్లో చాలా ఏళ్ల తరువాత రాజభరణాల రద్దు రూపంలో జరిగింది. రెండు: అది పెద్ద భూ ఎస్టేట్ల రద్దు చట్టాన్నీ, 1950 కాష్టాల్లోపడ్డ రుణగ్రస్తుల సహాయ చట్టాన్ని అమోదించింది. ఈ చర్య ద్వారా రాష్ట్రం అత్యంత సమూల భూ సంస్కరణల కార్యక్రమాన్ని చేపట్టింది. ఇది ఎటువంటి పరిహారం ఇవ్వకుండా భూస్వాముల ఎస్టేట్లు రద్దు చేసింది. 370వ అధికరణం కింద రాష్ట్రానికి స్వయంప్రతిపత్తి ఉంది కాబట్టి భారత రాజ్యాంగంలో భూస్వాముల హక్కులు కాపాడే 31వ అధికరణం ఆ రాష్ట్రానికి వర్తించకుండా పోయింది. అందువల్లనే అది ఈ పని చేయగలిగింది.

ఈ రెండు చర్యలు అభివృద్ధి నిరోధక ఫ్యూడల్ శక్తులకు ఆగ్రహం తెప్పించాయి. రాజుకు అనుకూల మైన ఆర్ఎస్ఎస్ వాళ్లు జమ్మూ–కాశ్మీర్‌కు వ్యతిరేకంగా ప్రచారానికి దిగడానికి ప్రధాన కారణం ఇదే.

కొన్ని లోపాలు కూడా ఉన్నాయి, ఉదాహరణకు రాజకీయ రంగంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తరగతులకు రిజర్వేషన్లు లేవు. జమ్మూ–కాశ్మీర్‌లో ఇప్పటికే ఉద్యోగాల్లో అటువంటి రిజర్వేషన్లు ఉన్నాయి కనుక

రాజకీయ చర్చల ద్వారా ఇలాంటి వాటిని సరిదిద్దుకోవచ్చు. అయితే గడచిన దశాబ్దాల్లో ఇటువంటి సమస్యలు లేవనెత్తడంగానీ పరిష్కరించడంగానీ జరగలేదు. ఇప్పుడు దాన్ని సాకుగా ఉపయోగించుకుని ఇటువంటి నిరంకుశ చర్యలకు ఈ పీడిత సామాజిక వర్గాల మద్దతు పొందేందుకు ప్రయత్నిస్తున్నారు.

**ప్రశ్న : కాశ్మీర్ ప్రజలు భారత దేశంతో సమైక్యం కావడానికి 370వ అధికరణం అడ్డుగా నిలుస్తుందా?**

జమ్మూ-కాశ్మీర్ భారతదేశంలో సమైక్యం కావడానికి 370వ అధికరణం అడ్డుగా ఉంది కాబట్టి దాని రద్దు చేస్తున్నట్లు పార్లమెంటు సమావేశంలో హోం మంత్రి అమిత్ షా వాదించారు. వాస్తవానికి కాశ్మీర్ ప్రజలు తమకు లభించిన హామీల ఆధారంగా తమంత తాము కోరుకుని భారత యూనియన్‌లో కలిశారు. ఆ హామీలే తరువాత 370వ అధికరణంలో చేర్చారు. తమ భవిష్యత్తు భారత దేశంలోనే భద్రంగా ఉంటుందని ఈ రాజ్యాంగ రక్షణలు వారికి హామీ ఇచ్చాయి. కానీ ఈ 370వ అధికరణంపై ప్రారంభం నుండి కేంద్ర ప్రభుత్వాలు దాడి చేస్తూనే ఉన్నాయి.

370వ అధికరణం కింద జమ్మూ-కాశ్మీర్‌కు ఇచ్చిన స్వయం ప్రతిపత్తిని హరించివేసేందుకు 1953 నుండి కేంద్రం చర్యలు ప్రారంభించింది. కేంద్రీకరణ, రాష్ట్ర స్వయంప్రతిపత్తి హరింపు క్రమం 1960వ, 70వ, 80వ దశకాల అంతటా సాగుతూనే వచ్చింది. రాష్ట్రానికి ఇచ్చిన స్వయంప్రతిపత్తిని హరించి వేసేందుకు 370వ అధికరణాన్ని కుళ్లబొడుస్తూ వచ్చారు. 1954లో వచ్చిన రాజ్యాంగం (జమ్మూ-కాశ్మీర్‌కు వర్తింపు) ఆదేశం నుండి 2010 వరకు మొత్తం 42 ఆదేశాలు జారీ చేశారు. ఇవన్నీ కూడా రాష్ట్ర వ్యవహారాల్లో కేంద్రం జోక్యాన్ని పెంచాయి. 370వ అధికరణం ఆమోదించినప్పుడు చెప్పని అనేక చట్టాలు ఈ కాలంలో చేశారు.

కేంద్రీకరణ క్రమం ద్వారా 370వ అధికరణం నిజమైన సారాంశాన్ని తొలగిస్తూ వచ్చారు. కేంద్ర జాబితాలోని మొత్తం 97 ఎంట్రీలు (చట్టాలు చేయదగ్గ అంశాలు)కుగాను 94 ఎంట్రీలను, ఉమ్మడి జాబితాలోని 47 ఎంట్రీలకుగాను 26 ఎంట్రీలను జమ్మూ-కాశ్మీర్‌కు వర్తింపజేశారు.

ఒకవైపు స్వయంప్రతిపత్తిని హరించి వేస్తూనే మరోవైపు రాష్ట్రంలో ప్రజాస్వామ్యాన్ని లేకుండా చేస్తూ, ప్రజాస్వామిక హక్కులను అణచివేస్తూ వచ్చారు. ఎన్నికైన ప్రభుత్వాలను కూలదోశారు. 1987 ఎన్నికల్లో మాదిరిగా కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో పలుమార్లు ఎన్నికలను నగ్నంగా రిగ్గింగు చేశారు. రాష్ట్ర ప్రజలు ముఖ్యంగా కాశ్మీర్ లోయలోని ప్రజలు దారుణమైన అణచివేతలను ఎదుర్కొన్నారు. కాల్పులు, అరెస్టులకు గురయ్యారు. పెల్లెట్ గాయాలు పదుల కొద్దీ యువకులను గుడ్డివాళ్లుగా మార్చేశాయి. మన సాయుధ బలగాల్లోనూ, పారా మిలటరీ బలగాల్లోనూ పెద్ద భాగాన్ని ఆ రాష్ట్రంలో మోహరించారు. దుర్మార్గ మైన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (అఫ్‌స్పా)ను రాష్ట్రంలోని పౌర ప్రాంతాలన్నిటిలోనూ వర్తింపజేశారు. పౌర ప్రాంతాలన్నిటా ఈ చట్టాన్ని ఎత్తివేయాలని సిపిఐ(ఎం) డిమాండ్ చేసింది.

ఈ అన్యాయమైన చర్యలన్నీ కూడా ప్రజలు రానురాను వేరుపడిపోడానికి దారితీసింది.

అణచివేత, బలవంతంతో సమైక్యత ఎన్నటికీ సాధ్యపడదు. రాజకీయ చర్చల ద్వారా మాత్రమే అది సాధ్యపడుతుంది. అయితే కేంద్ర ప్రభుత్వం అనేకమార్లు హామీలు ఇచ్చినప్పటికీ కాశ్మీర్ ప్రజలతో, వారి ప్రతినిధులతో రాజకీయ చర్చలు జరపడానికి నిరాకరించింది.

కేంద్ర ప్రభుత్వం విధానాల విషయంలో ఒక్కో చోట ఒక్కోలా వ్యవహరిస్తోంది. ఒకవైపు అది నాగా

వేర్పాటువాదుల ప్రతినిధులతో చర్చలు ప్రారంభించింది. అది కూడా విదేశీ గడ్డపైన. కానీ కాశ్మీర్‌లోని అన్ని సెక్షన్లతో మాట్లాడ్డానికి ఇష్టపడ్డం లేదు. రాజకీయ చొరవ తీసుకోడానికి మోడీ ప్రభుత్వం ఇష్టపడకపోవడం వల్లనే రాష్ట్రంలో పరిస్థితి మరింత దిగజారిపోయింది.

ఎన్ని విధాలా పలుచబరచబరిచినా 370వ అధికరణం ఇప్పటికీ కాశ్మీర్ స్వయం ప్రతిపత్తికీ, కాశ్మీర్ ప్రజల హక్కులు పునరుద్ధరించే రాజకీయ అవకాశానికీ చిహ్నంగానే ఉంది. దీన్ని మోడీ ప్రభుత్వం ఇప్పుడు పూర్తిగా లేకుండా చేసింది.

**ప్రశ్న : ఉగ్రవాదానికీ, కాశ్మీర్ పండిట్ల బాధలకూ 370వ అధికరణం కారణమా?**

370వ అధికరణం జమ్మూ-కాశ్మీర్‌లో వేర్పాటు వాదం, ఉగ్రవాదాలను పెంచి పోషిస్తోందని బిజెపి చెబుతోంది. పెద్ద నోట్ల రద్దుకు సాకులు చెప్పినట్లే ఇది కూడా పూర్తిగా తన చర్యలను సమర్థించుకునే సాకు మాత్రమే. పెద్ద నోట్ల రద్దు ఉగ్రవాదాన్ని నిర్మూలిస్తుందని ప్రధానమంత్రి చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకోండి, కానీ అది పూర్తిగా బోగస్ అని తేలిపోయింది. ఇతర రాష్ట్రాల్లో కూడా సుదీర్ఘ కాలం ఉగ్రవాదం తాండవించిన ఉదాహరణలున్నాయి. పంజాబ్‌లో ఖలిస్తాన్ ఉగ్రవాదులు రాష్ట్రాన్ని ఛిన్నాభిన్నం చేసినప్పుడు అక్కడ 370వ అధికరణం లేదు. ఉగ్రవాద చర్యల ద్వారా ఈశాన్య రాష్ట్రాలు విలవిలలాడినప్పుడు అక్కడా 370వ అధికరణం లేదు. కొన్ని రాజకీయ, ఆర్థిక పరిస్థితుల్లో ఉగ్రవాద గ్రూపులు, వారి చర్యలు బలపడ్డాయి, బలపడుతున్నాయి.

వాస్తవమేమంటే, 370వ అధికరణం కింద ఉన్న స్వయంప్రతిపత్తిని హరించి వేయడం, ప్రజాస్వామ్యాన్ని దారుణంగా అణచివేయడంతో జమ్మూ-కాశ్మీర్ ప్రజల్లో అసంతృప్తి పెరిగింది. వారు పరాయీకరణకు గురయ్యారు. అది వేర్పాటువాదం పెరగడానికీ, పాకిస్తాన్ ప్రోద్బలంతో ఉగ్రవాదం

పెరగడానికీ దారితీసింది. పాకిస్తాన్ నుండి పనిచేసే 'హిజ్బుల్ ముజహిద్దీన్' వంటి ఇస్లామిక్ శక్తులు, తరువాతి కాలంలో పాకిస్తాన్ నుండి పనిచేసే పాశవిక 'జైషే–ఇ–మొహమ్మద్', 'లష్కర్–ఇ– తొయిబా' వంటి గ్రూపులు పెరగడానికి కారణమయింది.

ఈ సమయంలో కాశ్మీర్ లోయలో అభివృద్ధి నిరోధక శక్తులు పెరిగిపోవడం వల్ల వినాశకరమైన పరిణామాలు జరుగుతున్నాయి. కాశ్మీరీయత్ లౌకిక పునాది బీటలు వారుతోంది. ఇప్పుడు పాకిస్తాన్ మద్దతు కలిగిన పచ్చి ఇస్లామిక్ శక్తులు దీన్ని పూర్తిగా అణచి వేస్తున్నాయి. దీనికి మొదటి ఉదాహరణ, 1990 దశకం మొదట్లో కాశ్మీరీ పండిట్లపై జరిగిన భయంకరమైన దాడులు, అకృత్యాలు, హింసాకాండ. ఇదంతా రాష్ట్రం రాష్ట్రపతి పాలన కింద, జగ్‌మోహన్ గవర్నర్‌గిరీ కింద ఉండగా జరిగింది. కాశ్మీరీ పండిట్లకు రక్షణ కల్పించడంలో కేంద్ర ప్రభుత్వమూ, గవర్నరూ ఘోరంగా విఫలమయ్యారు. నిజానికి జగ్‌మోహన్ హయాంలో అక్కడ శాంతి భద్రతలు పూర్తిగా కుప్పకూలిపోయాయి. ఏ జగ్‌మోహన్ అయితే కాశ్మీరీ పండిట్లను రక్షించడంలో ఘోరంగా విఫలమయ్యారో ఆ జగ్‌మోహన్ తరువాతి కాలంలో బిజెపిలో చేరిపోయి కేంద్ర మంత్రిగా ప్రమోషన్ పొందారు.

ఇది రాష్ట్రం చరిత్రలో సిగ్గుపడాల్సిన చాప్టర్. ఇప్పటికీ కూడా కాశ్మీరీ పండిట్లలో అత్యధిక భాగం తమ సొంత దేశంలోనే ప్రవాసులుగా జీవిస్తున్నారు. వాళ్లు తిరిగి తమ స్వంత ఇళ్లకు వెళ్లడం, చారిత్రకంగా వారు ఏ గడ్డపైన శాంతి, సామరస్యాలతో జీవించారో అటువంటి జీవనం కొనసాగించడం వారి ప్రాథమిక హక్కు. లౌకిక శక్తులను, మత సామరస్యాన్ని బలపరచడం ద్వారా ఇది సాధ్య మవుతుందేగాని, ఒక వైపు ఇస్లామిస్ట్‌లు మరోవైపు మతతత్వ సంఘపరివార్ శక్తులు అనుసరిస్తున్న విద్వేష రాజ కీయాలవల్ల కాదు.

మోడీ ప్రభుత్వ హయాంలో గత అయిదేళ్లలో పెరుగుతున్న ఉగ్రవాద ఘటనల్లో అత్యంత ప్రమాదకరమైన అంశమేమంటే, స్థానిక మిలిటెంట్ల నియామకాలు పెరిగిపోతున్నాయి. దీనికి 370వ అధికరణంతో సంబంధం లేదు. మోడీ ప్రభుత్వం ఎటువంటి రాజకీయ చొరవ ప్రదర్శించకపోవడంతో యువకుల్లోని నిస్పృహ, పరాయీకరణ అటువైపు దారితీస్తోంది.

దీని పర్యవసానాలు కాశ్మీర్‌పైనే కాకుండా మొత్తం భారతదేశంపైనే తీవ్రంగా ఉంటాయి. ప్రజాగళాన్ని ఎన్నాళ్లు అణచిపెట్టి ఉంచగలరు? కాశ్మీర్‌కు పంపించిన అదనపు బలగాలన్నీ కలిసి ఎన్నాళ్లు అక్కడ సాధారణ జీవనాన్ని, ప్రజల మధ్య సంబంధాలను నిరోధించి ఉంచగలవు. ఇది సరైన పరిష్కారం ఎంతమాత్రమూ కాదు.

**ప్రశ్న : 370వ అధికరణం కాశ్మీర్ ప్రజల అభివృద్ధిని ఆపేసిందా?**

భారత దేశంలో భూస్వాములకు పరిహారం ఇవ్వకుండా విస్తృతమైన భూసంస్కరణలు ప్రవేశపెట్టిన మొట్టమొదటి రాష్ట్రం జమ్మూ–కాశ్మీర్. నేషనల్ కాన్ఫరెన్స్, 370 అధికరణాన్ని ఉపయోగించుకుని చట్టాలు చేయడం ద్వారా సమూలమైన భూ సంస్కరణలు చేపట్టడం వల్ల, రాష్ట్రంలోని రైతులకు రుణవిముక్తి కల్పించడం వల్ల ఇది సాధ్యమైంది. ఈ కారణంగానే, పార్లమెంటులో అమిత్ షా చెప్పిన అబద్దాలకు విరుద్ధంగా జమ్మూ–కాశ్మీర్ రాష్ట్రం అనేక సామాజిక–ఆర్థిక సూచీల్లో దేశ సగటుకన్నా మెరుగ్గా ఉంది. బాగా అభివృద్ధి చెందాయని చెబుతున్న అనేక రాష్ట్రాలకు ధీటుగా ఉంది. ఆ రాష్ట్రానికి చెందిన పిడిపి ప్రభుత్వ మాజీ ఆర్థిక మంత్రి హసీబ్ డ్రాబూ ఇటీవల ఒక వ్యాసంలో ఈ కింది కొన్ని సామాజిక–ఆర్థిక సూచీలను వెల్లడించారు:

జమ్మూ-కాశ్మీర్‌లో 10 శాతం కుటుంబాలు మాత్రమే పేదరికం రేఖ దిగువన నివసిస్తున్నాయి. ఈ విషయంలో అఖిలభారత సగటు 22 శాతం.

దేశంలో అతి తక్కువ రుణగ్రస్త రాష్ట్రాల్లో జమ్మూ-కాశ్మీర్ రెండవది.

జమ్మూ-కాశ్మీర్ శ్రామిక ప్రజల్లో 2 శాతం మాత్రమే వ్యవసాయ కార్మికులుగా పనిచేస్తున్నారు. కానీ ఈ విషయంలో అఖిభారత సగటు 23 శాతం.

భారత దేశంలో సగటు ఆయుఃప్రమాణం 68 సంవత్సరాలు కాగా జమ్మూ-కాశ్మీర్‌లో ఇది 73 శాతం.

ప్రతి వెయ్యి జననాలకు శిశు మరణాల సంఖ్య జమ్మూ-కాశ్మీర్‌లో 32 కాగా జాతీయ సగటు 40.

జమ్మూ-కాశ్మీర్‌లో పారిశ్రామికాభివృద్ధికి అవకాశాల్లేవు అనేది కూడా బోగస్. ఎవరైనా జమ్మూ-కాశ్మీర్‌లో పరిశ్రమలు పెడితే అక్కడ 90 ఏళ్ల లీజుకు భూములివ్వడానికి, అది కూడా చౌకగా ఇవ్వడానికి ఆ రాష్ట్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది. అసలు సమస్య ఏమంటే, ఇటువంటి రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వ పెట్టుబడులు కావాలి. వాస్తవానికి ఈ సమస్య సరిహద్దు రాష్ట్రాలన్నిటికీ ఉంటుంది. అటువంటి ప్రదేశాల్లో కేంద్ర ప్రభుత్వ పరిశ్రమలు పెట్టాలి. మన ప్రణాళిక వ్యవస్థ విజన్ అదే. ఆర్థికంగా వెనుకబడిన ప్రాంతాల్లో ప్రభుత్వ రంగ సంస్థలను నెలకొల్పడం. అందువల్లనే భెల్, సైల్ వంటి సంస్థలు అప్పటికే పారిశ్రామికంగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లో కాకుండా హరిద్వార్, బొకారో, రాంచీ మొదలైనచోట్ల తమ ప్లాంట్లు నెలకొల్పాయి. ఇదే ఉద్దేశంతో హెచ్ఎంటి యూనిట్‌ను శ్రీనగర్‌లో నెలకొల్పారు. కానీ 2013లో దాన్ని మూసేశారు. దురదృష్టమేమంటే, గడచిన 73 ఏళ్ల కాలంలో జమ్మూ-కాశ్మీర్‌లో ఇటువంటి మూడు కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలను మాత్రమే నెలకొల్పారు. దాన్లో

పెట్టుబడులు కేవలం రూ. 165 కోట్లు మాత్రమే. వాటిలో ప్రస్తుతం ఉద్యోగాలు చేస్తున్న వారు 21 మందే.

ప్రయివేటు పెట్టుబడులు లేకపోవడానికీ ప్రజల పరాయీకరణ, ఉగ్రవాదం పెరుగుదల, తరచు 144వ సెక్షన్, కర్ఫ్యూ విధింపునకూ సంబంధం లేదు. ప్రస్తుతం మనం చూస్తున్న అసాధారణ దిగ్బంధనాలు కాశ్మీర్‌లో పారిశ్రామికీకరణకు ఏ విధంగానూ తోడ్పడబోవు.

చివరిగా, రాష్ట్రంలో విపరీతమైన అవినీతి, ప్రజాధనం దుర్వినియోగానికి 370వ అధికరణం కారణమని నిందిస్తున్నారు. ఇతర రాష్ట్రాల్లో కూడా, చివరికి బిజెపి పాలిత రాష్ట్రాల్లో కూడా అవినీతి విశృంఖలంగా తాండవిస్తోంది. దీనికీ, 370 అధికరణానికీ సంబంధమే లేదు. వాస్తవానికి ఇటువంటి పరిస్థితి జవాబుదారీతనం, ప్రజాతంత్ర క్రమం లేకపోవడం వల్ల ఉత్పన్నమవుతుంది. జమ్మూ-కాశ్మీర్ రాష్ట్రంలో చాలా కాలంగా దాదాపు పోలీసు రాజ్యం నడుస్తోంది. అంతకుమించిన సుదీర్ఘ కాలం (మొత్తంగా చూస్తే 10 ఏళ్లపాటు) కేంద్ర పాలన కింద ఉంది. కేంద్రీకృత అధికార-భద్రతాదళాల యంత్రాంగం, ఎటువంటి జవాబుదారీతనం లేనివారి రాజకీయ మిత్రులు.. వీళ్లు రాష్ట్రంలో అవినీతికి ప్రధాన కారణం.

## ముగింపు

మనం గమనించినట్లు హిందూత్వ మతతత్వ శక్తులు, ఫ్యూడల్ పాలనకు వ్యతిరేకంగా నేషనల్ కాన్ఫరెన్స్ నాయకత్వంలో జరిగిన ఉద్యమానికి మొదటి నుండీ వ్యతిరేకులు. జనసంఘ్‌కు పూర్వ రూపమైన ప్రజా పరిషత్ జమ్మూ-కాశ్మీర్‌ను స్వతంత్ర దేశంగా ఉంచాలని కోరుకున్న మహారాజాకు మద్దతుగా నిలబడింది. జమ్మూ-కాశ్మీర్ విలీనం తరువాత జనసంఘ్‌గానీ, హిందూ మహాసభగానీ ఆ రాష్ట్రానికి స్వయం ప్రతిపత్తి ఇవ్వడాన్ని పూర్తిగా వ్యతిరేకించాయి. భారతదేశం

కేంద్రీకృతంగా, మెజారిటీ మతతత్వ పాలనలో ఉండాలన్నది ఆర్ఎస్ఎస్ నడిపించే జనసంఘ్ సిద్ధాంతం. తరువాత ఏర్పడిన బిజెపి సిద్ధాంతం కూడా అదే. అందువల్ల అవి రాష్ట్రాలకు ఎటువంటి స్వయం ప్రతిపత్తినైనా వ్యతిరేకిస్తాయి. అంతేకాదు కాశ్మీర్ లోయ ముస్లిం మెజారిటీ ప్రాంతం కావడం కూడా వాటి శత్రుపూరిత వైఖరికి ఒక కారణం.

కాశ్మీర్ లోయలోని ప్రజల మత కూర్పు వల్ల అది వేర్పాటువాదానికీ, ఉగ్రవాదానికీ నిలయంగా మారిపోయిందని ఆర్ఎస్ఎస్-బిజెపి కథనాలు అల్లుతోంది. ముస్లిం వ్యతిరేక పక్షపాతం వల్లనే వారు కాశ్మీర్ ప్రజల ప్రజాతంత్ర ఆకాంక్షలను ఆ విధంగా శత్రుపూరితంగా చూస్తున్నారు. 370వ అధికరణాన్ని రద్దు చేయడమంటే వారి ఉద్దేశం భద్రతా-రాజ్య యంత్రాంగం ద్వారా కాశ్మీర్‌లోయలోని ప్రజలను అణచిపారేద్దామనే.

ఆర్ఎస్ఎస్, మోడీ-షా ద్వయం ఉద్దేశంలో కాశ్మీర్ అనేది అఖండ భారత్‌కు చెందిన ఒక నేల భాగం మాత్రమే. అక్కడి ప్రజలు ముస్లింలు కాబట్టి వారిని విదేశీయులుగా పరిగణించాలి. వారికి కాశ్మీర్ కావాలి గానీ కాశ్మీర్ ప్రజలు వద్దు: వారి జాతీయవాదం నేల మాత్రమే, ప్రజలు కాదు. వారి దృష్టిలో జాతి అంటే ప్రజలు కాదు, కేవలం సరిహద్దులు దాని నేల మాత్రమే.

జమ్మూకూ, కాశ్మీర్ లోయకూ మధ్య మతపరమైన విభజన సృష్టించేందుకు ఆర్ఎస్ఎస్, బిజెపీలు పట్టుదలతో పనిచేస్తున్నాయి. 2014లో కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఈ ప్రయత్నాలు మరింత ముమ్మరమైనాయి. పౌరుల నిరసన ప్రదర్శనలను కర్కశంగా అణచి వేయడం, వాటిని మిలిటెన్సీగా పరిగణించడం, అన్ని రకాల రాజకీయ చర్చలను ఆపివేయడం వంటి కఠోర వైఖరి రాష్ట్రంలో పరిస్థితిని మరింత క్షీణింపజేసింది. గత కొద్ది సంవత్సరాలుగా స్థానిక యువకులు మరింత ఎక్కువగా మిలిటెన్సీలో

చేరిపోతున్నారు. ఈ కాలంలో చనిపోతున్న భద్రతా దళాలు, మిలిటెంట్ల సంఖ్య క్రమంగా పెరుగుతున్నదని గణాంకాలు చెబుతున్నాయి.

కాశ్మీర్ ప్రజల గుండె ధైర్యాన్ని దెబ్బతీసి, కాశ్మీర్ జనాభా నిష్పత్తిని మార్చడానికే 370వ అధికరణం కింద జమ్మూ-కాశ్మీర్‌కు లభించిన ప్రత్యేక ప్రతిపత్తిని రద్దు చేయడం, రాష్ట్రాన్ని ముక్కలు చేయడం జరిగింది. కాశ్మీర్‌లో మోడీ-షా చర్యల వెనుక వాస్తవ ఉద్దేశం అదే.

అంతేకాకుండా మోడీ పాలనలో భారతదేశ ఫెడరల్ లక్షణంపై దాడి జరుగుతోంది. రాజకీయ, ఆర్థిక రంగాల్లో రాష్ట్రాల హక్కులు హరించి వేయబడుతున్నాయి. కేంద్రం అన్ని అధికారాలను చేజిక్కించుకుంటున్నది. జమ్మూ-కాశ్మీర్ హక్కులపై దాడి ఈ కేంద్రీకృత నిరంకుశ ధోరణిలో భాగమే.

దీనికి వ్యతిరేకంగా సిపిఐ(ఎం) కృతనిశ్చయంతో పోరాడుతుంది. ఈ చర్యలు మొత్తం దేశ ఐక్యతకూ, ప్రయోజనాలకూ పూర్తిగా వ్యతిరేకమని పేర్కొంటోంది. రాజ్యాంగ విలువలపై నమ్మకమున్న పౌరులంతా ఏకమై, జమ్మూ-కాశ్మీర్‌లో ప్రజాస్వామ్య పునరుద్ధరణకోసం, పూర్తి స్వయంప్రతిపత్తి కోసం పోరాడుతున్న ఆ రాష్ట్ర ప్రజలతో భుజం భుజం కలిపి పోరాడాల్సిన తరుణమిది.

**_References and direct use from:_**

*A.G.Noorani, Law and Politics: Frontline, September 19, 2000*

*CPI(M) Central Committee Resolution, November 2010*

*Kashmir and its Future: Harkishan Singh Surjeet, 1955*

*Authoritarian Assault on Democracy and Freedom: Prakash Karat, Peoples Democracy,August 5-11, 2019*